అడల్ట్స్ ఓన్లీ!

**రవీంద్ర కిటికీ దగ్గర నుంచున్నాడు.**

**బయట వెన్నెల జలపాతంతో ప్రకృతంతా జలకాలాడుతున్నట్లుంది. తెల్లని వెన్నెల ప్రవాహంలో సర్వప్రపంచం మునిగి తన్మయావస్థలో జోగుతోంది.**

**తదేకంగా బయటికి చూస్తున్నాడు రవీంద్ర. అతని మనసు అశాంతిగా వుంది. అలజడిగా వుంది. ఆందోళనగా వుంది.**

ఎందుకో తడబాటుగా వుంది. వీటన్నిటి మధ్యా చిత్రమైన ఉద్వేగం వుంది. తన్మయభావం వుంది. వీటన్నిటికీ కారణం ప్రశాంతమైన వెన్నెల రాత్రి కాదు.

రెప్పవెయ్యక అటే చూస్తున్నాడు కానీ రవీంద్ర మనసులో వెన్నెల లేదు. పరిసరాలకు అతీతంగా అతని హృదయం ఎక్కడో చిక్కుకుని దారి తప్పిన పసివాడిలా ఆరాటపడుతోంది.

''వెన్నెల రాత్రులు వస్తే మీకు పట్ట పగ్గాలుండవు. రాత్రులకు రాత్రులు ఆరు బయట వెన్నెలలో తడుస్తూ-స్వప్నలోకాలలో తేలిపోవటం..పిచ్చి..పిచ్చి కవితలు గిలకటం..మీ వెన్నెల తోడుంటుందిగా..ఈ రెండ్రోజులూ హాయిగా రాసుకుంటూ గడిపెయ్యండి'' సునీత బంధువుల ఇంట్లో పెళ్ళికి వెడుతూ చెప్పింది.

కానీ ఆమె అనుకున్నట్లు అతను వెన్నెలను హాయిగా అనుభవించలేకపోతున్నాడు.

అపురూపంగా లభించే ఆ మధురమైన అవకాశాన్ని ఉపయోగించుకోలేక పోతున్నాడు.

రవీంద్రకు వెన్నెల ప్రేరణ!

అతను వెన్నెలలో అందాన్ని, ఆనందాన్నీ చూస్తాడు. విషాదాన్ని వియోగాన్ని చూస్తాడు.

శుక్లపక్షపు రాత్రులు-చంద్రుని కళలు అతని మనసు మీద ఎంతో ప్రభావితం చూపుతాయి.

టెర్రస్ మీద చిన్న రూఫ్ గార్డెన్‌లో కుర్చీ ఖాళీగా వుంది. చిన్నబల్లమీద తెల్లకాగితాలు వెయిట్ క్రింద చల్లగాలికి రెపరెపలాడుతున్నాయి. అతను మాత్రం బెడ్‌రూం విండో దగ్గర కర్టెన్ను తొలగించి స్తబ్ధంగా నిలబడి వున్నాడు.

ఒకే విషయంపైన లగ్నమైన మనసుతో ఆ ఒక క్షణం నిలువనీయని ఆశ-మరు నిమిషం కృంగదీసే నిరుత్సాహం..ఆలోచనలలో అలసిపోయినట్లు వచ్చి ఫోం మీద వాలాడు రవీంద్ర. పిల్లో క్రింద నుంచి కవరు తీసి గుండెల కాన్చుకున్నాడు.

అతని కళ్ళలో రవళి కదులుతోంది.

''మీరు పెద్ద కవి కదా..నాకు కూడా కాస్త కవితలు రాయటం నేర్పకూడదూ..'' అడిగింది ఒకసారి రవళి.

ఆ రోజు ఆమె తను రాసిన కవితను రవీంద్రకి చూపించి అతని అభిప్రాయం అడిగింది.

''మీరు కవితలు రాస్తారా?.. వెరీగుడ్'' అని చిరునవ్వుతో ప్రశంసించి కుతూహలంగా కవిత చూసాడు.

'నీకోసం' అని శీర్షిక పెట్టి రవళి రాసిన కవిత చూసి అతను నవ్వు ఆపుకోలేకపోయాడు. ఒక ప్రేయసి తన ప్రియుడికి రాసిన సుదీర్ఘ ప్రేమలేఖలా వుంది కవిత. అక్కడక్కడ ఎన్నుకున్న మంచి పదాలున్నాయి. అతని నవ్వు చూసి చిన్నబుచ్చుకుంది రవళి.

# మచ్చ

''సారీ...కించపరచాననుకోవద్దు..కవిత రాసే పద్ధతి ఇది కాదు..ముందు మంచి కవితలు చక్కగా చదవండి..శ్రీశ్రీ....తిలక్ వంటి వారివి..'' అన్నాడు.

''మీరు కూడా బాగా రాస్తారుగా..మీవి చదవచ్చుగా..'' అంది రవళి అదోలా..

''చదవచ్చు..కానీ నేను అంతటివాడిని కాదు..కొత్తగా నేర్చుకునే వారు ప్రామాణిక కవులను అధ్యయనం చెయ్యాలి''


ఆమె కాస్త నిరుత్సాహపడింది త్వరత్వరగా కవయిత్రిగా పేరు సంపాదించెయ్యాలన్న కాంక్ష మీద నీరు చల్లినట్లయింది.

రవళి రవీంద్ర పనిచేస్తోన్న కాలేజీలోనే కామర్స్ లెక్చరర్‌గా చేస్తోంది. రవీంద్ర తెలుగు రీడర్. ఆమె కంటే ఐదు సంవత్సరాల సీనియర్.

రవళికి కవితలు రాయాలన్న కోరిక తీవ్రంగానే వుందని స్పష్టం చేస్తూ తరువాత మళ్ళీ రెండు, మూడు కవితలు రాసి 'గురువు' గారికి చూపింది.

ఈసారి కాస్త మెరుగు.

ఒక వాక్యాన్ని మూడు ముక్కలుగా చేసి చిన్న, చిన్న



పంక్తులుగా రాసింది.

"మీకు రాయాలన్న తపన వుంది. కృషి చెయ్యండి. మంచి కవితలు రాయగలుగుతారు. ఇవే మళ్ళీ రాయండి. తప్పకుండా ఒక రోజు మీరు మంచి కవయిత్రి అయి తీరుతారు!" నిరుత్సాహ పరచలేక ప్రోత్సహిస్తూ చెప్పాడు.

ఆమె కళ్ళు మెరిసాయి. "నిజంగానా గురువుగారూ!" అంది పక్కనే కూర్చుని మంద్రంగా.


అతను ఉలిక్కిపడ్డాడు. "గురువుగారూ!" అని ఆమె పరిహాసానికి అందా అనిపించింది.

ఏమైనా కవితల పుణ్యమాని రవళితో పరిచయం పెరిగింది.

ఇప్పుడతను ఆమె రాసి చూపిస్తున్న కవితల్ని చదవటం లేదు. ఆమె అంతరంగాన్ని చదవాలని ప్రయత్నిస్తున్నాడు.

ఆలోచిస్తున్న కొద్దీ రవళి ప్రతీమాటలోనూ ఏదో అంతరార్థం-రెండో అర్థం వుందని పిస్తోంది.

ఆ నవ్వు..ఆ చూపులు..చనువు తెలిపే సరసాలు..వేళాకోళాలు, వ్యంగ్యోక్తులు.."యస్..తప్పకుండా ఆమె మన



సులో ఏదో వుంది. పైన తనంటే స్పష్టంగా కనపడుతున్న అడ్మిరేషన్. అది కేవలం తను ఆమె అభిమాన కవి కావటం వల్ల మాత్రమే కాదని ఆ చూపుల మెరుపే చెప్తోంది. 'యస్..దేరీజ్ సంథింగ్..' అనవసరంగా ఎక్కువసేపు తనతో మాట్లాడుతూ కూర్చోటం 'గురువుగారూ!' అని పదే, పదే అదోరకమైన స్వరంతో పలవరిస్తున్నట్లు పిలవటం... ఇదంతా. 'అది' కాకపోతే మరేమిటి? వికసించిన వెన్నెలలా రవళి పరువం రవీంద్రని నిలవనీయక ఆరాటపెడుతోంది. చిరుగాలి తాకిడికి పులకరించి జల జల రాలే పూలతీగలా ఆమె సోయగాలు తొందర చేస్తున్నాయి.

రవీంద్ర ఒక నిర్ధారణకి వచ్చేసాడు.

ఉండబట్టలేక చిన్న ప్రణయ కవితలో తన కాంక్ష అక్షరీకరించి అందించాడు. అతడు కవి. అనురాగమయినా మోహావేశమైనా-వియోగమైనా..సంయోగమైనా..అందమైన భావుకతతో కవితీకరించి చెప్పటం అతని ప్రత్యేకత. ఉద్విగ్నతతో కొత్తగా చలిస్తున్న స్వరంతో "ఇది..చదివి..మీ 'అభిప్రాయం' చెప్పండి" అన్నాడు.

"ఓహ్...గురువుగారూ..కొత్త కవితా ఫెంటాస్టిక్" అంటూ ఆనందపడిపోతూ అక్కడికక్కడే చదువుతుంటే...రవీంద్ర తడబడుతూ "రేపు చెప్పండి..బాగా చదివి!" చెప్పి తప్పుకున్నాడు.

మరునాడు ఆమె అంది. "ఎంతో బాగుంది. మీ కవితలో ఒక విశేషం వుంది చెప్పనా..!" గలగలలాడుతున్న గుండెలతో మనసులోని కాంక్ష ఎక్కడ కళ్ళలలోకి జారి పట్టిస్తుందోనని పుస్తకంలో చూపు గుచ్చి "చెప్పండి" అన్నాడు మంద్రంగా.

"ఎవరు చదివితే వారిని ఉద్దేశ్యంచి రాసినట్టే అనిపిస్తుంది. మీ కవిత..మెస్మరైజ్ చేసిందనుకోండి. అవును కానీ గురువుగారూ..ఎప్పుడూ పేదరికం..ఆకలి..కన్నీరు అంటూ సామాజిక దృశ్యాలు చిత్రిస్తారే మరి ఇదేమిటండీ..కొత్తప్రేమికుడిలా ఇంత ఆర్తిగా ప్రణయ కవిత రాసారు? ఏ పత్రికకు పంపుదామనుకుంటున్నారు? ఇది మాత్రం ప్రచురిస్తే మీ మీద పెద్ద దుమారమే రేగుతుందండోయ్. సింప్లీ సూపర్బ్..కాస్త మత్తు ఎక్కువైనట్లనిపించినా..బాగుంది. నా ఉద్దేశ్యంలో ప్రణయ కవిత అదే భావకవిత అంటే అట్లాగే వుండాలి." అని ముక్తాయింపుగా నిట్టూర్చి 'ఇంత చక్కటి కవిత నేనెప్పటికి రాయగలుగుతానో' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించింది.

ఆమె తన కవి హృదయాన్ని అర్థం చేసుకోలేకపోతోందని రవీంద్ర గ్రహించాడు.

ఇలా కాదనుకున్నాడు. తన మనసు సూటిగా స్పష్టంగా చెప్పెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ప్రేమలేఖ రాసియ్యాలనుకున్నాడు. అలవోకగా అలతి, అలతి పదాలతో అలరించే కవితలల్లే రవీంద్రకు చిన్న ప్రేమలేఖ రాయటం పెద్ద పనైంది.

ఎన్నోసార్లు చిత్తు రాసి..చించేసి చివరకు ఎట్లాగో రాసి కవర్లో వుంచాడు.

ఆ క్షణాన రవీంద్ర మనసులో రవళి అందం..ఆమెను పొందాలన్న తీవ్రమైన కాంక్ష తప్ప మరో ఆలోచన లేదు.

ఉత్తరం మరోసారి చదువుకుని గుండెల కాన్చుకుని విశ్రాంతిగా బెడ్ మీద వాలి సిగరెట్ ముట్టించుకుని కళ్ళు మూసుకున్నాడు. కలల లోకంలో విహరిస్తున్నాడు రవళితో-

అకస్మాత్తుగా ఏదో వింత వాసన అతన్ని ఈ లోకంలోకి లాక్కొచ్చింది. కళ్ళు తెరిచి చూస్తూనే ఉలికిపాటుతో 'అరె! ఇదేమిటి?' అనుకుంటూ చప్పున లేచాడు.

గులాబి రంగు ప్రేమలేఖ కొద్ది కొద్దిగా కాలిపోతోంది.

గుండెలమీద పరధ్యానంతో సిగరెట్ జారి కాగితం మీద పడిందని గ్రహించాడు.

ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు. నివురుగప్పిన నిప్పులా కాగితం క్రింద నుంచి షర్టుకు పాకి నిప్పు గుండెల్ని రగిలిస్తోంది.

ఒక్క ఉదుటున లేచి కాగితం క్రిందకు తోసాడు. కాగితాన్ని సోకిన నిప్పు చిన్న, చిన్నగా గులాబి రంగు కాగితాన్ని మసిచేస్తూ పాకుతోంది.

రవీంద్ర దిగ్భ్రాంతితో అలా చూస్తున్నాడు. అతను చూస్తుండగానే కొద్దిక్షణాల్లో అతని గులాబిరంగు ప్రేమలేఖ కాలి బూడిదైపోయింది.

నిప్పు తగిలిన ఎద భగ్గుమంటుంటే వాస్తవంలోకి వచ్చాడు. గుండె నిమురుకుంటూ చూస్తే ఎర్రగా కమిలిన చిన్న మచ్చ కాలి రంగులో మనసులోని వికారం పోయి-అగ్నిపునీతమైన భావం!

కామదహనం జరిగినా..ఈ మచ్చ! రవీంద్ర నిర్వికారంగా నవ్వుకున్నాడు.

బయట వెన్నెల జలపాతం.

★

**యర్రమిల్లి విజయలక్ష్మి**

---

## A జోక్స్

### మళ్ళీసారి పిలుస్తాలే

"నన్ను నీ పెళ్ళికి పిలవలేదేం?" నవ్యని అడిగింది నాగమణి.

"హడావుడిలో మర్చిపోయాను. ఇంకోసారి పిలుస్తాలే" సింపుల్‌గా చెప్పింది సినీతార నవ్య.

**-పరిమళా కిశోరి** (మేడిబావి)

★★★

### మతిమరుపు

"ఈమధ్యేవిటోయ్ ఆఫీసుకి సరిగా రావడం లేదు?" అడిగాడు సోమరాజు.

"నా భార్యకు అంతంత మాత్రంగా వున్న మతిమరుపు తగ్గడానికి మందులు వాడిన తర్వాత ఇంకా ఎక్కువయిపోయిందోయ్. స్నానం చేసి బట్టలు కట్టుకోవడం కూడా మరచిపోయి బాత్‌రూమ్‌లో నుండి బయటకొచ్చేస్తుంది. ఆమెను కనిపెట్టుకొని వుండాలి కదాని" చెప్పాడు భీమరాజు.

"మీ ఇంటి పక్క పోర్షన్స్ ఏమయినా ఖాళీ అయితే చెప్పవోయ్. మేం ఇల్లు మార్చేస్తాం."

**-ఉజ్జిని కనకదుర్గ**